# కామెడీ కథ

దర్భా లక్ష్మీ అన్నపూర్ణ

# ఆర్తనాదం అగచాట్లు

పెళ్ళిచూపుల సీనులో అందరూ ఆసీనులయి వున్నారు. ఒక్క పెళ్ళి కూతురు తప్ప, అబ్బాయి తరఫు వాళ్ళు ఉత్కంఠగా వున్నారు. అమ్మాయి రాకకోసం ఎదురుచూస్తున్నారు. నిజానికి వాళ్ళకి అమ్మాయి రూపురేఖలు తెలియనివికావు. టి.వి.స్క్రీన్‌మీద ఆమె దర్శన భాగ్యాన్ని ఎన్నోసార్లు పొందారు. తెరమీద చూసిన అమ్మాయిని యిప్పుడు ప్రత్యక్షంగా చూడబోతున్నాం అంటే వాళ్ళకి ఆనందంగానూ వుంది ఆత్రంగానూ వుంది.

అక్కడే కూర్చున్న అమ్మాయి తరఫు ముఖ్యులకి యింకో విధమైన టెన్షన్‌గా వుంది. ఇప్పుడు అమ్మాయిని చూడటానికి వచ్చిన వాళ్ళందరూ ఆమెని టీవీ స్క్రీన్ మీద చూసిన వాళ్ళే అయినా తెరమీద కనిపించే మొహం వేరు. ఆ మొహానికి ఎన్నో రంగులు అద్ది రంగుల ఫ్రేముల్లోంచి చూపిస్తారు. ఇప్పుడు ఆ రంగులు కడిగేసిన సహజ వదనాన్ని వీక్షించాల్సి వస్తుంది. వాళ్ళు హఠాత్తుగా డీలాపడిపోయి నీరుగారిపోరు కదా అన్న భయం వాళ్ళని పట్టుకుని వేధిస్తోంది. "బావుంది. తెరమీది మొహాలకి, నిజజీవితంలో మొహాలకి తేడా వుంటుందన్న విషయం తెలియని బడుద్ధాయిలెవరుంటారు" అని మళ్ళీ అంతలోనే వాళ్ళకి వాళ్ళే సర్ది చెప్పుకున్నారు.

ఇరుపక్కలవాళ్ళు ఆ విధమైన టెన్షన్‌లలో వుండగానే అమ్మాయి వచ్చేలోపు తోచుబాటుగా వుంటుందని అమ్మాయి తరఫు బంధువొకాయన అబ్బాయిని వుద్దేశించి "నీ పేరేవిటబ్బాయ్?" అని అడిగాడు.

"ఆర్తనాదం" అతి ప్రశాంతంగా పెళ్ళికొడుకు చెప్పటం అయితే చెప్పాడుకాని విన్నవాళ్ళు మాత్రం ఆర్తనాదం చెయ్యబోయి అతికష్టం మీద ఆపుకున్నారు. వాళ్ళ మొహాల్లో ఆ ఎక్స్‌ప్రెషన్ చూసిన ఆర్తనాదం ఒక్క క్షణం ఖంగుతిని ఆ మరుక్షణం గ్రహించాడు. ఇది తన పేరు తెచ్చిన ప్రమాదమని. తనకంటే చెప్పీ చెప్పీ అలవాటయిపోయింది కానీ తన పేరు ప్రభావం ఎలాంటిదో ప్రత్యక్షంగా తెలుస్తోంది యిప్పుడు. కొత్తవాళ్ళతో యిది మామూలే అయినా బాధగానే అనిపిస్తుంది. ఆడపిల్ల తరఫువాళ్ళ ఖంగుతిన్న మొహాలు చూడటం అబ్బాయి తరఫువాళ్ళకి మహా యిబ్బందిగా అనిపించింది. ఆర్తనాదం తండ్రి వెంటనే సర్దుబాటుగా అన్నాడు. "అదేలెండి. ఆర్.నాదం అనుకోవచ్చు"

అవుననలేక, కాదనలేక అమ్మాయి తరఫువాళ్ళు ఓ వెర్రినవ్వుని తమ మొహాల్న పులుమేసుకున్నారు. పేరులో ఏముందిలే - అబ్బాయి బాగానే వున్నాడుగా అని సర్దిచెప్పుకోవటానికి ప్రయత్నించారు. కానీ పెళ్ళికొడుకు పేరు విన్న అందరి గుండెల్లోనూ ఏదో తెలియని ఆర్తనాదం మార్మోగుతూనే వుంది.

ఇంతలో అమ్మాయి రానే వచ్చింది. పేరుతో తన యిమేజ్ దెబ్బతిన్నందుకు మనస్సులోనే ఆర్తనాదం చేసుకుంటున్న ఆర్తనాదం ఒక్కసారిగా కుర్చీలో నిటారుగా అయ్యాడు. ఓ రెండు మూడు నిముషాలు ఆ గదిలో నిశ్శబ్దం! ఆ తర్వాత ఆర్తనాదం మేనత్త అడిగింది. అమ్మాయిని ఏదో విధంగా పలకరించాలి అన్నట్టుగా "నీ పేరేవిటమ్మాయ్?"

"పి.వి.ముచ్చట" ముచ్చట్లు మాట్లాడడానికి అస్సలు యిష్టం లేనట్టుగా మొహం పెడుతూ చెప్పింది.

"అమ్మాయి అసలు పేరు యింకేదయినా వుందా?" ఆర్తనాదం తల్లి అడిగింది.

"అబ్బే లేదండీ! అసలు పేరూ, టీవీలో పేరూ ఒకటే! అలా సినిమా వాళ్ళకి వుంటాయేమోగానీ టి.వి.వాళ్ళకి వుండవులెండి" ముచ్చట తల్లి అంది.

"పూర్తి పేరు?"

"పూర్తిపేరు పగడాల వాగుడుకాయ ముచ్చట!" ముచ్చట తల్లి కాస్త యిబ్బందిగానే చెప్పింది. ఈసారి వులిక్కిపడి వెర్రిమొహాలు వేసుకుని మర్యాదకోసం 'యిహీ' అనటం అబ్బాయి పక్కవాళ్ళు వంతయింది. ఆర్తనాదానికి అప్రయత్నంగానే ఆనందంగా అనిపించింది.

"ముచ్చట బాగానే వుంది కానీ వాగుడుకాయ అని పెట్టటం.." అంటూ ఆర్తనాదం మేనత్త సందేహంగా ఆగిపోయింది.

"అదా" అని ఓ చిన్ననవ్వు నవ్వి ముచ్చట తల్లి చెప్పింది అసలు విషయం.. "పెళ్ళయిన కొత్తలో నేను ముంగిలా మాట్లాడకుండా వుండేదాన్నని మావారికి చిర్రెత్తుకొస్తూ వుండేది. ఎంత ప్రయత్నించినా నాచేత గడగడ మాట్లాడించలేకపోయారు! ఆ బాధతో కూతురికి వాగుడుకాయ అని పేరు పెట్టేసుకున్నారు. పేరు గుర్తు చేసుకునయినా గలగలమని మాట్లాడుతుందని. అదేవిటో..మా ముచ్చట నాకన్న తక్కువ మాట్లాడుతుంది. వీలయినంత వరకూ సంజ్ఞలతో పనికానిచ్చేసుకుంటుంది"

"మితభాషి సూక్ష్మగ్రాహి అంటారులెండి! ఏం ఫర్వాలేదు" ఆర్తనాదం తండ్రి మొహమాటంతో సర్దిచెప్పాడు.

ఆ తర్వాత టి.వి.నాటకాల గురించి, రాజకీయాల గురించీ జనరల్‌గా సంభాషణ జరిగిపోయింది. ఆర్తనాదం, ముచ్చట ఒకరినొకరు అదనుదొరికినప్పుడల్లా చూసుకుంటూనే వున్నారు. అందరి కాఫీ ఫలహారాలూ అయ్యాయ్. ఇంటికి వెళ్ళాక ఏ విషయమూ వుత్తరం రాస్తాం (లేకపోతే ఫోన్ చేస్తాం) అనే సాంప్రదాయిక పద్ధతికి స్వస్తిపలికేస్తూ శుభస్య శీఘ్రం అనేసుకున్నారు. ఒకరికొకరం వియ్యాలవారం అయిపోదాం అని పెద్ద వాళ్ళు నిర్ణయించేసుకున్నారు. అమ్మాయి, అబ్బాయి మునిముని నవ్వులు అంగీకారంగా తీసేసుకుని.

ఆర్తనాదానికీ, ముచ్చటకీ ఆ తర్వాత ముచ్చటగా సన్నాయి నాదాలతో మూడుముళ్ళూ పడిపోయాయ్.

* * *

ముచ్చట పాలగ్లాసుతో శోభనం గదిలోకి అడుగు పెట్టింది. ఆర్తనాదానికి చెప్పలేనంత ఆందోళనగా వుంది. ముచ్చటయితే అప్పుడప్పుడు యిలాంటి సీనుల్లో నటించి వుంటుంది. అందుకే బెస్టుగా ఎలా వుండాలో తెలుస్తుంది. ధైర్యంగా చిరునవ్వులు చిందిస్తూ వచ్చేస్తోంది ముచ్చట. దగ్గరకి వస్తూనే పాల గ్లాసు చేతికి అందించింది.

"అబ్బెబ్బే! అప్పుడేనా..అలా స్టూలుమీద పెట్టాలి కదా!" అని తడబడుతూ అన్నాడు కానీ తను చెప్పింది తప్పేమో అనిపించింది. "ఓసి బడుద్ధాయీ! యిప్పటి దాకా సినిమాల్లో శోభనం సీన్లేవీ చూడలేదా?" అంటుందేమోనని భయం వేసింది.

"తాగండీ! తాగండీ - అబ్బతాగండీ - అబ్బతాగండీ!" అంది ముచ్చట పదే పదే.

'నేను తాగను అనలేదు కదా ఒకసారి తాగండి అనగానే - వెంట వెంటనే మళ్ళీ మళ్ళీ అబ్బతాగండీ - ఎందుకు? ముచ్చటక్కూడా గాభరాగా వున్నట్టుగా వుంది. తాగేస్తే పోలా?' అనుకున్న ఆర్తనాదం ముచ్చట చేతిలోంచి పాల గ్లాసుందుకుని గబగబా తాగేశాడు.

'అయ్యో, నాకు మిగల్చ లేదా?' అన్నభావం వచ్చేలా సంజ్ఞ చేసింది ముచ్చట. హడావుడిలో, టెన్షన్‌లో తను చేసిన పనికి సిగ్గుతో చితికిపోయాడు ఆర్తనాదం. ముచ్చటకి జాలేసి ఫర్వాలేదు ఫో అన్నట్టుగా సంజ్ఞ చేసింది మళ్ళీ.

సంజ్ఞ లెందుకు..మాట్లాడొచ్చుగా అనుకున్నాడు గానీ పైకి అనలేదు. సంజ్ఞలెందుకో కాస్సేపున్నాక తనకి స్పష్టంగా అర్థం అవుతుందన్న విషయం ఆక్షణంలో ఆర్త

నాదానికి తెలీదు.

కాస్సేపు ఒకరినొకరు ముచ్చటగా చూసుకున్నాక ఆర్తనాదం ముచ్చటని దగ్గరకి తీసుకున్నాడు. మరుక్షణం వులిక్కిపడ్డాడు.

"అబ్బ తాగండీ! అబ్బ తాగండీ" అన్న మాటలు వినిపించాయ్.

"తాగేశానుగా!" అయోమయంగా మొహం పెడుతూ అన్నాడు ఆర్తనాదం. ముచ్చట సిగ్గుపడుతూ తన జాకెట్టులోంచి ఓ బుల్లి టేప్‌రికార్డర్ తీస్తూ అంది. "మనిద్దరం దగ్గరవటంలో యిది రివైండయిపోయి మళ్ళీ ప్లేలోకి వెళ్ళిపోయినట్టుంది!" అలా అంటూనే దాన్ని పక్కనే వున్న టేబిల్ మీద పెట్టింది.

ఆర్తనాదానికి యిప్పుడు మరీ అయోమయంగా అనిపించింది. అయినా పెద్దగా పట్టించుకోలేదు. ఏదో టేప్‌రికార్డర్‌కి సంబంధించిన గొడవలే అనుకున్నాడు.

ఇంతలో ముచ్చట సిగ్గుపడుతూనే ఆర్తనాదం భుజం మీద తలవాల్చింది. ఆమె భుజాల చుట్టూ చెయ్యి వేశాడు ఆర్తనాదం. కిలకిలమని నవ్వింది ముచ్చట. నవ్వుతూనే అతని గుండెల మీదకి జార్చుకుంది తన వదనాన్ని. ఈ ప్రపంచాన్ని మర్చిపోబోతున్న ఆర్తనాదానికి అంత పారవశ్యంలోనూ ఏదో చిన్న అనుమానం చీపురుపుల్లలా చురుక్కుమని గుచ్చుకుంది. ఎక్స్‌ప్రెషనేమో తన గుండెల మీంచీను - దాని తాలూకు ధ్వనులేమో పక్కనున్న బుల్లిటేప్ రికార్డర్ లోంచి వస్తున్నట్టుగా అనిపిస్తోంది. మొదటిరోజు కదా నెర్వెస్‌నెస్‌లో అలా అనిపిస్తోందిలే అనుకోబోయాడు గానీ యింతలో ముచ్చట తన బుగ్గమీద చిటికె వెయ్యటంతో అప్రమత్తుడయి తనూ చిలిపిగా ముచ్చట బుగ్గమీద చిటికె వేశాడు. వెంటనే ముచ్చట సిగ్గుపడుతూ 'ఊ, ఆ' అంటూ పారవశ్యాన్ని తెలియజేసే శబ్దాలు చేసింది. కానీ ఆ శబ్దాలు ముచ్చట మొహంలో ఆ పారవశ్యపు ఎక్స్‌ప్రెషన్ మారాక విన్పించాయి. దాంతో శబ్దం టేప్‌రికార్డర్‌లోంచి వస్తోంది అని నిర్ధారణ అయిపోయింది. దానివైపే చిత్రంగా చూస్తూ వుండిపోయాడు ఓ క్షణం. తర్వాత అన్నాడు "మధ్యలో అది మాట్లాడుతోందేవిటి?"

ముచ్చట ముసిముసిగా నవ్వేస్తూ అంది. "వెంటనే చిటికె వెయ్యకుండా ఒక్క క్షణం ఆగవలసింది. ఎక్స్‌ప్రెషన్ మ్యాచవును"



"అంటే..."

"ఊ..ఆ శబ్దాలు దాన్లోంచి వచ్చాయ్!" ముచ్చట గొంతు గరగరమంటూండగా టేప్ రికార్డర్ వైపు చూపించింది. ఆర్తనాదానికి వెంటనే అర్థం కాలేదు. ముచ్చట చెబుతున్నది ఏవిటో. మాటలాడకుండా టేప్‌రికార్డర్ పెట్టుకోవలసిన అవసరం ఏమిటి? యిది జీవితం కనుక అతి సహజంగా అతనికి ఆ ఆలోచన వచ్చేసింది.

"దాన్లోంచి ఎందుకు?" అన్నాడు.

ముచ్చట జవాబు చెప్పేలోపు పరవశాన్ని వ్యక్తం చేసే శబ్దాలు మరిన్ని వినిపించాయ్ టేప్‌రికార్డర్‌లోంచి.

ఆర్తనాదంలో అలజడి క్షణక్షణానికీ పెరిగిపోతోంది.

ముచ్చటకి మాట్లాడటంలో ఏదయినా సమస్య వుందా? ఆర్తనాదం మొహంలో తొందర తొందరగా ఆర్తనాదం ఒక్కసారిగా ఆర్తనాదం చేద్దాం అనుకున్నాడు. కానీ గది బయటవుండే జనం కంగారుపడిపోతారేమోనని గొంతుని నొక్కిపట్టి ఆ గజిబిజి మస్తిష్కాన్ని తన మొహంలోని కండరాల్ని కదిలింపచెయ్యటం ద్వారా, కళ్ళని పత్తికాయల్లా చెయ్యటం ద్వారా చూపించాడు.

రెండు నిముషాలయ్యాకగాని ముచ్చట మాటలకి అర్థం ఏమిటో తెలియలేదు ఆర్తనాదానికి. బెస్టుగా వుండాలనుకున్నప్పుడల్లా డబ్బింగ్ చెప్పించుకోవటం అలవాటయిపోయింది. గొంతు కూడా తుప్పుపట్టి మూలపడివున్న మిషన్ సౌండ్‌లా గరగరమంటోంది. అయినా ఎందుకో తన చెవులకి విందుగానే అన్పించింది ఆర్తనాదానికి.

అయినా చాలా వైవిధ్యభరితమైన ఈ బిల్డప్ ఆర్తనాదానికి మింగుడుపట్టం లేదు తక్షణమే! తనేం శోభనం గదిలో డ్యూయెట్లు పాడుకుందాం అనలేదుగా! అదే మాట పైకి కూడా అన్నాడు. పాటకయితే శ్రావ్యమైన గొంతు, సంగీతం అవసరం. డబ్బింగ్ వద్దు అని గట్టిగా చెబుదాం అనుకున్నా కొత్తపెళ్ళాం ఆమె!

'ఆన్ చెయ్యనా?' అన్నట్టుగా సంజ్ఞ చేస్తూ అడిగింది ముచ్చట. టి.వి.లో అలవాటయిన గొంతయినా ఆర్తనాదానికి ఏదో తెలియని యిబ్బంది. యిప్పుడా టేప్ రికార్డర్‌లోంచి ఏవేం మాటలు వస్తాయో! తనేం జవాబు చెప్పాలో?! ఏడుపు మొహంతో పక్కనే వున్న టేప్‌రికార్డర్ వంక చూశాడు ముచ్చట చటుక్కున దాన్ని ఆన్ చేసింది.

ముచ్చట ఆర్తనాదం బుగ్గమీద ఛట్‌మని తట్టి తన వైపు తిప్పుకుని కళ్ళతో ఏదో చెప్పబోయి - యింతలో టేప్‌రికార్డర్‌లో డైలాగు స్టార్టయిపోవటంతో మంత్రం వేసినట్టుగా పెదాలకదలికని మొదలుపెట్టేసింది.

"అబ్బ! మీ మీసం ఒత్తుగా చాలా బావుంటుందండి!"

ఆర్తనాదం గతుక్కుమన్నాడు. తన మీసం ఒత్తుగా లేదుగా! డైలాగుల్లో అబద్దాలు కూడానా కొంపతీసి! ఆర్తనాదం గాభరాగా ముచ్చట పెదాల వైపు, టేప్ రికార్డర్ వైపు మార్చి మార్చి చూట్టం తప్ప రొమాంటిక్ ఎక్స్‌ప్రెషన్ యివ్వలేకపోయాడు. రెండు నిమిషాలదాకాను! తర్వాత పెదాల మీదకి నవ్వుని తెచ్చుకుని ఛాతీని గర్వంగా పొంగించాడు. బాగా ఫీలయిడైలాగ్ మొదలు పెట్టాడు. కాస్త ఆలస్యం అయిందిలావుంది. నీ పెదాలు గులాబిరేకుల్లా బావుంటాయ్ అనేంతలో ముచ్చట డైలాగ్ మళ్ళీ స్టార్టయిపోయింది. హడావుడిగా ఆర్తనాదం నోటిని నొక్కేసి మళ్ళీ మంత్రం వేసినట్టుగా లిప్ మూవ్‌మెంట్ యిస్తూ బ్రహ్మాండంగా ఎక్స్‌ప్రెషన్ యిచ్చేసింది ముచ్చట! "మీ పళ్ళు, కళ్ళు, ముక్కు చాలా బావుంటాయ్! ఆ!"

ఈసారి డైలాగుకీ ఆర్తనాదం బిక్కమొహం వేశాడు. యిదేమిట్రోయ్ నాయనోయ్..పళ్ళు, కళ్ళు ప్రాస కుదిరిందనా..కానీ ముచ్చట మాత్రం అద్భుతమైన ఎక్స్‌ప్రెషన్ యిచ్చేస్తోంది. తనూ ఏదయినాచెప్పాలి. ఏం చెప్పాలి? అంతా హడావుడిగా, గందరగోళంగా వుంది. గబగబా డైలాగ్ చెప్పేయ్యాలి? ఏం చెప్పాలి? మళ్ళీ ముచ్చట డైలాగ్ స్టార్టయిపోతుంది. మెదడుని ఝళిపించాడు ఒక్కసారిగా! ఆ! ఆడవాళ్ళకి పొడవైన జడ! కళ్యాణమంటపం సినిమాలో కాంచన జడ జ్ఞాపకం వచ్చింది. డబ్బింగ్ అనేసరికి ఆర్తనాదం కూడా పూర్తిగా సినిమా మూడ్‌లోకి వెళ్ళిపోయాడు.

"నీ పొడవాటి జడ.." అంటూ ముచ్చట తల వెనక చెయ్యి పెడితే పొట్టిగా తగిలింది. డైలాగు తప్పుయిపోయినందుకు గుటకలు మింగాడు. పెళ్ళి పీటలమీద మరి పొడవాటి పూల జడ? ముచ్చట విరగబడి నవ్వింది. టేప్‌రికార్డర్‌లో నవ్వులేదులా వుంది. అందుకే శబ్దం లేకుండా నవ్వింది ముచ్చట! శబ్దం లేని ఆ విరగబాటు నవ్వుకి ఆర్తనాదం బిక్కచచ్చిపోయాడు.

తన డైలాగ్ స్టార్టవ్వగానే మళ్ళీ ముచ్చట పెదాలు అల్లల్లాడించెయ్యటం మొదలుపెట్టేసింది.

## కోలీవుడ్‌లో మరోసారి

***ఒకప్పుడు బిజీ హీరోయిన్ రంభ టాలీవుడ్‌లో తన కెరీర్ కాస్త డల్ కాగానే తమిళనాట అడుగుపెట్టి అక్కడ పాపులర్ స్టార్ అయింది. కానీ అక్కడ కూడా పరాజయాలు చవిచూడడంతో మళ్ళీ తెలుగులో ప్రయత్నించింది. టాలీవుడ్‌లో సెకండ్ ఇన్నింగ్స్ అంతగా కలిసిరాలేదామెకి. అందుకనే ఇప్పుడు మళ్ళీ మరోసారి తమిళ రంగంలోకి అడుగుపెడుతోందిట. ఈసారి అక్కడ తన కెరీర్ బావుంటుందనే ఆశతో వుందిట రంభ. ఆల్ ది బెస్ట్!***



మారిపోతున్న రంగులు చూసి ముచ్చట యిక తన మనసులో మాట వివరంగా చెప్పేయాలనుకుంది. టేప్ రికార్డర్ నోటిని తాత్కాలికంగా మూసేసింది. ఆర్తనాదాన్ని సుఖాసీనుడ్ని చేసింది. చెప్పటం ప్రారంభించింది.

"నేను అన్నీ బెస్టుగా వుండాలనుకున్నప్పుడు నా గొంతు వాడను. అది చాలారోజులుగా అలవాటయిపోయింది. మన ఈ తొలిరేయి ముచ్చట్లన్నీ జీవితాంతం గుర్తుంచుకోవాలి కదా! అందుకే నా డబ్బింగ్ ఆర్టిస్ట్ చేత బాగా బాగా ఆలోచించి ఈ రొమాంటిక్ డైలాగులన్నీ చెప్పించుకొచ్చాను. మధ్య మధ్యలో మీరు మాట్లాడేందుకు గ్యాప్ యిచ్చి నా మాటలు రికార్డు చేయించుకున్నాను. ఈ రాత్రికి యిదే నా ఆఖరి మాట! గొంతు మార్చి ఎక్కువసేపు మాట్లాడలేను!"

ఇదెక్కడి విడ్డూరం. డబ్బింగ్‌లు నిజ జీవితంలోకి కూడా వచ్చేశాయా?

తనవంతు వచ్చేసరికి గాభరాలో ఏం చెప్పాలో తెలియలేదు ఆర్తనాదానికి. ఈ అనుభవం అతగాడికి కొత్తగావుండటంతో సమయానికి మాటలు దొరకటం లేదు. అదే మామూలుగా అయితే వుప్పొంగిన అతని హృదయంలోంచి మాటలు ప్రవాహంలా వచ్చేసును. ఇప్పుడేమో టేప్‌రికార్డర్ వైపు చూడటమే సరిపోతోంది. అందుకే రెండు నిముషాల క్రితం ముచ్చట చెప్పిన డైలాగ్‌నే రిపీట్ చేశాడు. "నీ కళ్ళు, పళ్ళు చాలా బావున్నాయ్! హి..హి!"

డబ్బింగ్ అలవాటులేని ఆర్తనాదం కాస్త గాభరా పడుతున్నాడులే అని సర్దుకుంది ముచ్చట. రెండురోజులు పోతే స్విచ్‌వేస్తే లైట్ వెలిగినట్టు అదే అలవాటయిపోతుందిలే అనుకుంది.

ఆ రాత్రంతా ముచ్చటతో మూగగా తర్జనభర్జనలు పడ్డాక టేప్‌రికార్డర్ వైపు భయంగా ఒకసారి, బిక్క మొహం వేసుకుని ఒకసారి చూస్తూ "యిలా నేను టేప్ రికార్డర్‌తో రొమాంటిక్ డైలాగులు చెప్పటం ఎన్నాళ్ళు?" అని అడిగాడు.

ఈసారి ముచ్చట చిరునవ్వు నవ్వింది. "ఒక పాప పుట్టేదాకా!" డబ్బాలో రాళ్ళుపోసి అల్లల్లాడించినట్టుగా వుంది. ఆర్తనాదం క్రింద పడబోయి తమాయించుకున్నాడు. తనకి సన్నగా, నాజూగ్గా వుండే గొంతుకన్నా డబ్బాలో రాళ్ళు పోసి ఆడించినట్లుగా వుండే గొంతంటేనే ఎంతో యిష్టమని, అసలు నీ గొంతు చూసే నేనీ పెళ్ళికి ఒప్పుకున్నానని కాస్తంత అతిశయంగా చెప్పాడు.

ముచ్చట హఠాత్తుగా ఛర్రుమని లేవటంతో ఆర్తనాదం హతాశుడయ్యాడు. "అబద్ధం! నేను పెళ్ళిచూపుల్లో మాట్లాడలేదుగా!" అసలే గరగరమనే గొంతు హైపిచ్‌లో యింకా గరగరని సంతరించుకుంది. ఆర్తనాదానికి మాత్రం గుండెలమీద పన్నీటి జల్లు కురిసినట్టయింది. అదేమాట పైకి అన్నాడు కూడాను. ముచ్చట అతగాడి అభిప్రాయంతో ఏకీభవించలేదు. మొదటి రాత్రి కదూ - అందుకే అంత అపురూపంగా అనిపిస్తుంది. పదేళ్ళయ్యాక తల్చుకున్నా ఈ రాత్రి అపురూపంగా అనిపించాలి. అందుకే ఈ ఏర్పాటు చేశాను. ఎంతో పదిలంగా దాచుకుందాం అనుకున్న జ్ఞాపకాలని రసాభాస చేస్తున్నారని అలిగింది ముచ్చట. ఆర్తనాదం సహజత్వానికి వున్న విలువను చెప్పబోయినా ముచ్చట ససేమిరా ఒప్పుకోనంది. పెళ్ళయ్యాక ఒక సంవత్సరం దాకా అది రొమాంటిక్ ఛాప్టరంది! అప్పటిదాకా టేప్‌రికార్డర్‌ని విడిచిపెట్టనంది.

ఆ మర్నాడు వుదయం ఆర్తనాదం స్నేహితుడు వచ్చాడు. "నీ పెళ్ళికి రాలేకపోయాను. నీకిష్టమని బుల్లి టేప్‌రికార్డర్ దుబాయ్ నుంచి తెచ్చా"నంటూ ఆ స్నేహితుడి చేతిలో పెట్టబోతే ఆర్తనాదం కెవ్వుమన్నాడు. తన చేతిలోని టేప్ రికార్డర్‌ని భయపడిపోయి చటుక్కున వదిలేయబోయిన ఆ స్నేహితుడు ఏడుపుమొహంతో ఏవయిందరా అని అడిగాడు. తన గోడు చెప్పుకుని "యింపోర్టెడ్ టేప్‌రికార్డరంటే ఆ డబ్బింగ్ పీరియడ్‌ని యింకా పెంచేస్తుందేమోరా? ఏమీ అనుకోవద్దు!" అన్నాడు.


ఆ మర్నాడు ముచ్చట ఆర్తనాదాన్ని "నా ఫ్రెండ్ వచ్చింది - పరిచయం చేస్తాను రండి" అంటూ అతడ్ని హాల్లోకి తీసుకు వెళ్ళింది.

"నా పేరు పంకజం - ముచ్చట, నేను శరీరం గొంతులాంటి వాళ్ళం!" నవ్వుతూ అతి మామూలుగా చేప్పేసింది పంకజం. ఆర్తనాదానికి ఆ పోలికేదో ఎప్పుడు విననట్టుగా కొత్తగా అనిపించింది. శరీరాలు వేరయినా మనస్సు ఒక్కటే అన్న పోలిక విన్నాంగానీ యిదే పోలిక అనుకోబోతుంటే ఆర్తనాదానికి విషయం హఠాత్తుగా అర్థం అయిపోయింది. ఆ గొంతు పరిచితంగా అనిపించి ఏదో అనుమానంగా ఆవిడవైపు పరిశీలనగా చూడటానికి భయపడ్డాడు. రాత్రి టేప్‌రికార్డర్‌లో ఆవిడ మొహం కూడా కనిపిస్తుందేమోనన్న భయం వేసింది. ఓ వెర్రినవ్వు నవ్వాడు ఎటో చూస్తూ. "నా నటనకి డబ్బింగ్ చెప్పేదీవిడే!" ఆర్తనాదం అహా అని చెప్పి గబగబా లోపలికి వచ్చేశాడు.

పగటిపూట ముచ్చట ఎక్కువగా మాట్లాడదు. అన్నీ చేతలతోనూ, సంజ్ఞలతోనూ అర్థం అయ్యేలా చేస్తుంది. ఆర్తనాదానికి మనస్సుకి కాస్తంత ఒత్తిడిగా అనిపించింది. రాత్రయ్యేటప్పటికి టేప్ రికార్డర్ సిద్ధం! ఆర్తనాదానికి ఒకలాంటి హడావుడి ధోరణి వచ్చేస్తోంది రాత్రయ్యేటప్పటికి. ముచ్చట మొహంకేసి కన్నా అప్రయత్నంగా టేప్‌రికార్డర్ వైపే ఎక్కువగా చూస్తున్నాడు. ముచ్చట డైలాగు అవ్వగానే తను చెప్పాలన్న కంగారు ఎక్కువయిపోయింది తప్ప తన భావోద్వేగానికీ, ప్రేమోద్వేగానికీ ప్రాముఖ్యత నివ్వలేకపోతున్నడు. అదే విషయం ముచ్చటతో చెప్పుకుని ఏడ్చాడు కూడాను. ముచ్చట ససేమిరా వీల్లేదంది. టేప్‌రికార్డరే తన ప్రియసఖి అన్నట్టుగా ఒకసారి పరుగునపోయి టేప్ రికార్డర్‌ని కౌగలించుకున్నాడు కూడాను హడావిడిలో. అతగాడి అయోమయావస్థకి ముచ్చట విరగబడి నవ్వేది.

★ ★ ★

ముచ్చట పురిటినెప్పులతో ఆర్తనాదాలు చేస్తున్నప్పుడు ఎవరో గిలిగింతలు పెట్టినట్టు కిలకిల నవ్వుకుంటూ వంకర్లు తిరిగిపోయాడు ఆర్తనాదం. చుట్టుపక్కల వున్న ఆడవాళ్ళూ, మగవాళ్ళూ కూడా ఆర్తనాదాన్ని రాక్షసుడా, నిర్దయుడా అన్నట్టుగా చూశారు. అతగాడు అదేం పట్టించుకునే స్థితిలో లేదు. ఒకటే ఆలోచన - ముచ్చటకీ, తనకీ స్వరబంధనం కూడా ఏర్పడబోతోంది. ఆర్తనాదం ఆనందానికీ ఆనకట్ట వెయ్యటం ఆ క్షణంలో ఆ బ్రహ్మాతరం కూడా కాదు.



## దీపం వుండగానే...

*తెలుగు భామ సమీరారెడ్డి హిందీలో బిజీ తార. అఫ్‌కోర్స్ ఒకటి రెండు తెలుగు సినిమాలూ చేసిందని తెలుసు కదా! తాజాగా ఆమె తమిళ సినిమా రంగంలోకి కూడా ప్రవేశించింది. సూర్య హీరోగా నిర్మాణమవుతున్న సినిమాలో కథానాయికగా నటిస్తోంది సమీర. ఓ వైపు చెన్నయ్‌లో షూటింగ్‌లో పాల్గొంటూనే అక్కడ భూముల గురించి ఎంక్వయిరీలు చేసి మరీ లాండ్స్ కొంటోందిట సమీర. లాండ్ మీద పెట్టే పెట్టుబడి గొప్ప నిధి లాంటిదేనని ఇటీవల అనేకమంది రుజువు చేయడంతో చాలామంది సినిమా తారల్లాగే సమీర కూడా ఇలాగే చేస్తోందన్నమాట.*